

మొబైల్ 'స్విచ్ఛాఫ్' నిరసన
గాజాకు సిపిఎం సంఘీభావం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ గాజా కోసం మౌనం' (సైలెన్స్ ఫర్ గాజా) పేరిట నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ డిజిటల్ నిరసన కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సంఘీభావం తెలుపుతున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. జులై 13వరకూ ప్రతి రోజు రాత్రి 9 గంటల నుంచి 9.30 గంటల వరకు ఒక అరగంట పాటు ప్రజలందరూ తమ మొబైల్ ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసి గాజాకు సంఘీభావం తెలపాలని కోరారు. నిర్ణీత సమయంలో ప్రతిరోజూ అరగంట పాటు మొబైల్ ఫోన్‌లను ఆపివేయడం అనే డిజిటల్ అంతరాయం చిన్న విషయమే అయినా వాస్తవానికి ఇది చాలా శక్తివంతమైన చర్యని పేర్కొన్నారు. పోస్టులు పెట్టడం, లైక్ చేయడం, ఇతరులకు పంపడం వంటి చర్యలు చేయరాదని సూచించారు. ప్రపంచవ్యాప్త 'సైలెన్స్ ఫర్ గాజా' డిజిటల్ నిరసనోద్యమంలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

స్విమ్స్ కార్మికుల విజయం

అధికారులహామీతో దీక్షలు విరమణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్ ఆస్పత్రిలో మూడు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న వార్డుబాయిలు తమకు వేతనాలను పెంచడంలోనూ, హోదాను నిర్ణయించడంలోనూ వివక్ష పాటిస్తున్నారని రెండేళ్లుగా టిటిడి కాంట్రాక్టు కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తూనే వచ్చారు. జూన్ 4న సమ్మె నోటీసు ఇచ్చి ఆందోళన ప్రారంభించిన కార్మికులు జులై 5న శనివారం రాత్రి అధికారుల హామీతో దీక్షలను విరమించారు. పది రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు స్విమ్స్ డైరెక్టర్, ఎఎస్‌పి, ఆర్‌డిఒ, విజిఒ, టిటిడి ఉన్నతాధికారులు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఇది స్విమ్స్ కార్మికుల ఘన విజయం అని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిబిఎస్ మణ్యం, కందారపు మురళి అన్నారు. శు క్రవారం టిటిడి ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తిరుపతి పద్మావతి అతిథిగృహంలో సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారని, కార్మికుల సమస్యలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారని తెలిపారు. శనివారం మధ్యాహ్నం సిఐటియు నేతలతో కలిసి ఆర్డీవో కార్యాలయంలో చర్చలు జరిగాయి. శనివారం రాత్రి డైరెక్టర్ ఆర్‌వి కుమార్, ఆర్డీవో రామ్మోహన్‌రెడ్డి, ఎఎస్‌పి రవి మనోహరాచారి, టిటిడి ఎఫ్‌ఎ అండ్ సిఎఒ రవిప్రసాద్, డిప్యూటీ ఈవో గోవిందరాజులు, విజిఒ సదాలక్ష్మి, లక్ష్మి శ్రీనివాస కార్పొరేషన్ జిఎం రాంకుమార్, స్విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ దీక్షా శిబిరం వద్దకు విచ్చేసి, స్పష్టమైన హామీ ఇచ్చి, దీక్షలను విరమింపజేశారు. నాయకులు టి సుబ్రమణ్యం, కే వేణుగోపాల్, మాధవ్,బుజ్జి యూనియన్ నేతలు రవి, సూరి, మారి ముత్తు, గోపి, వేలు, కోటయ్య, జయమ్మ, కుమారి, రజనీకాంత్, వెంకటేశు, మునికష్ణ, భాష, సుబ్రహ్మణ్యం తదితరులు ప్రసంగించారు.




ఉన్నతాధికారుల హామీతో రిలేదీక్షలు విరమించిన స్విమ్స్ కాంట్రాక్టు కార్మికులు

నిరంతర నిఘా

క్వాలిటీ... క్వాంటిటీపై...

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):



బంగారం కొంటున్నారా.... అయితే సంబంధిత లీగల్ మెట్రాలజీ విభాగం సూచిస్తున్న జాగ్రత్తలను వినియోగదారుడు తప్పనిసరిగా పాటిస్తూ నాణ్యమైన సేవలు పొందాలని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి సూచిస్తున్నారు. బంగారం కొనుగోలు సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, దీనిపై ఎంత పర్యవేక్షణ వినియోగదారుడు చూపాలన్న దానిపై 'ప్రజాశక్తి' నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి సూక్ష్మ అంశాలను వివరించారు.

ప్రజాశక్తి: బంగారం విక్రయించే షాపులపై లీగల్ మెట్రాలజీ ఏ విధమైన నిఘా ఉంచుతుంది?

అసిస్టెంట్ కంట్రోలర్: బంగారం విక్రయించే పెద్ద మాల్స్, చిన్న షాపుల వరకు ప్రతి ఒక్కరూ లీగల్ మెట్రాలజీ విభాగం సూచించే నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. మా విభాగం ద్వారా బంగారం విక్రయించే మాల్స్, షాపులలో స్టాండర్డ్ వెయిట్స్ ప్రకారం తూనిక జరుగుతోందా లేదా అన్న అంశాలను ఏడాదిలో పలుమార్లు ఆయా షాపులలో పరిశీలిస్తాం. నిబంధనల ప్రకారం బంగారం విక్రయించే షాపులో ఉన్న తూనిక యంత్రాన్ని తనిఖీ సమయంలో స్టాండర్డ్ వెయిట్ తో కొలమానం చేసి దానికి సీల్ వేస్తాం. అలా సీల్ వేయబడిన తూనిక యంత్రంలోనే బంగారం బరువును షాపు నిర్వాహకులు కొలిచి విక్రయాలు చేయాల్సి ఉంటుంది. ఎవరైనా బంగారం విక్రయ షాపులలో వినియోగంలో లేని తూనిక యంత్రాలను ఉంచినా దాన్ని తప్పిదముగా భావించి లీగల్ మెట్రాలజీ నిబంధనల ప్రకారం జరిమాణా వేస్తాము. గత నెలలో తిరుపతి పరిధిలో వినియోగంలో లేని తూనిక యంత్రాన్ని షాపులో ఉంచడం వలన రూ.10 వేల రూపాయల జరిమానా విధించాము.

ప్రజాశక్తి: కొత్త బంగారం కొనడానికి పాత బంగారం ఇచ్చే సమయంలో వినియోగదారుడు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి?

అసిస్టెంట్ కంట్రోలర్: మహిళలకు ఎంతో ప్రీతికరమైన వస్తువు బంగారం. పాత బంగారం ఇచ్చి కొత్త బంగారం కొనుగోలు చేయడానికి చాలామంది ఆసక్తి చూపుతుంటారు. అయితే పాత బంగారాన్ని తీసుకొని కొత్త బంగారం కొనుగోలు చేయడానికి బంగారం విక్రయ షాపుకు వెళ్లిన సమయంలో సంబంధిత షాపు నిర్వాహకుడిని వినియోగదారుడు తమ ముందే తమ పాత బంగారాన్ని కరిగించి, ఎంత బరువు ఉందో సరిచూసుకోవాలి. తాము ఇచ్చిన పాత బంగారానికి విలువను ఎంతకు నిర్ధారిస్తున్నారో తెలుసుకోవాలి. వినియోగదారుడు ముందే వారి పాత బంగారాన్ని కరిగించి చూపకపోతే వినియోగదారుడు మోసపోయే ప్రమాదం ఉంది కనుక ఈ సూచన చేస్తున్నాం. ఇదే విషయాన్ని సంబంధిత బంగారు విక్రయ షాపుల నిర్వాహకులకు తెలియజేశాము.

ప్రజాశక్తి: దొంగ బంగారం విదేశాల నుండి అక్రమ పద్ధతిలో దిగుమతి చేసుకొని బంగారు వినియోగ డిజైన్స్ ను తయారుచేసి విక్రయించే వారిపై లీగల్ మెట్రాలజీ పరిధి ఎంత?

అసిస్టెంట్ కంట్రోలర్: లీగల్ మెట్రాలజీ విభాగం బాధ్యత వినియోగదారుడికి క్వాలిటీ... క్వాంటిటీ పూర్తిస్థాయిలో అందివ్వడమే. దొంగ బంగారం అనేది దొంగతనాలు జరిగిన తరువాత దొంగల నుండి కొనుగోలు చేసిన బంగారం వంటి వ్యవహారాలను పోలీసు శాఖలోని క్రైమ్ విభాగం వారు పర్యవేక్షణ చేస్తుంటారు. విదేశాల నుండి అక్రమ పద్ధతిలో దిగుమతి చేసుకునే బంగారం పట్ల డిఆర్ఐ, కేంద్రం అధికారులు పర్యవేక్షణ చేస్తుంటారు. లీగల్ మెట్రాలజీ పరిధిలో వినియోగదారుడుకి నాణ్యమైన సేవలు అందుతున్నాయా లేదా, లేదంటే సంబంధిత యాజమాన్యాలకు లీగల్ మెట్రాలజీ విభాగం ద్వారా భారీ జరిమానా విధిస్తాం.



లీగల్ మెట్రాలజీ ఏసి స్వామి

ప్రజాశక్తి: బంగారం అమ్మకాలలో మా వద్ద తక్కువ అని వస్తున్న ప్రకటనలలో వినియోగదారుడు గమనించాల్సింది ఏమిటి?

అసిస్టెంట్ కంట్రోలర్: సాధారణంగా బంగారం 100 శాతం అని చెప్పాలంటే 24 క్యారెట్ల బంగారం. దీనితో విక్రయ దారుడు అనుకున్న విధంగా డిజైన్లను తయారు చేయలేరు కనుక 22 క్యారెట్ల 91.6 తో 1.4 శాతం రాగి, ఇతర లోహాలను చేర్చి తామనుకున్న డిజైన్లను తయారుచేసి విక్రయిస్తుంటారు. ఇందుకుగాను వాల్యూ యాడెడ్ చార్జెస్ వసూలు చేస్తుంటారు. ఇది చట్టబద్ధమే. దీనిపై రూపుదిద్దుకున్న డిజైన్ అమ్మకానికి గాను కేంద్ర, రాష్ట్రాలకు జీఎస్టీ రూపంలో పనులు విధించడం జరుగుతుంది. ఈ వ్యాల్యూ యాడెడ్ చార్జెస్ అధిక డిజైన్లు లేని బంగారానికి తక్కువ ఉండడంతో బంగారం కొన్ని దుకాణాలలో తక్కువ అని ప్రకటనలు చేస్తుంటారు. బంగారం వస్తువు డిజైన్ కు అయ్యే ఖర్చుతో ఈ వ్యాల్యూ యాడెడ్ చార్జెస్ అనేవి ముడిపడి ఉంటాయి. వినియోగదారుడు ఇటువంటి సూక్ష్మ విషయాల పట్ల జాగ్రత్తలు తీసుకొని బంగారాన్ని కొనుగోలు చేయాల్సి ఉంది.

ప్రజాశక్తి: బంగారం విక్రయ షాపులలో ఎటువంటి తూనిక యంత్రాలను వినియోగించాల్సి ఉంటుంది?

అసిస్టెంట్ కంట్రోలర్: బంగారం పెరుగుదల, తగ్గుదల అనేది మార్కెట్లో సర్వసాధారణంగా ఉన్న నేపథ్యంలో లీగల్ మెట్రాలజీ విభాగం 2011 నిబంధనల ప్రకారం 1 ఎంజి, అంతకన్నా తక్కువ బరువును చూపే తూనిక యంత్రాన్ని బంగారం విక్రయ షాపులలో వినియోగించాలని చట్టం ఉంది. దీనిని ఎవరు అతిక్రమించరాదు.

సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా బైకు ర్యాలీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, యంత్రాంగం

మోడీ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీన చేపట్టబోయే దేశ వ్యాప్త కార్మికకర్షక సమ్మెకు సంఘీభావంగా కార్మిక సంఘాలు ఆదివారం పట్టణంలో నిర్వహించిన బైకు ర్యాలీ జయప్రదమైంది. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గహం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ఏఐటీయూసీ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కత్తిరవిలు మోడీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సంయుక్తంగా ధ్వజమెత్తారు. కార్మికులను కట్టు బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. దేశ ప్రజల ప్రయోజనాలను పక్కనపెట్టి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీ రాజీనామా చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, వెంకటేష్, వేణు, కార్తీక్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

- తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో టిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ సిఐటియు నాయకులు గోల్కొండ వెంకటేష్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. గోల్కొండ వెంకటేష్ మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి లక్షలాది మంది ఉద్యోగులకు పెన్షన్ లేకుండా చేసి వారి హక్కులను హరింపజేశారన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పనిని 12 గంటలకు పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు పిఆర్‌సి, డిఎ ఇవ్వకూడదనే దుర్మార్గమైన చట్టాన్ని పార్లమెంట్‌లో చట్టం చేశారన్నారు. మహిళలు నైట్ షిఫ్ట్ పనిచేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసిందన్నారు. విశాఖ ఉక్కును అంబానీ, అదానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కాటా గుణశేఖర్, పట్నం దయాకర్, నైనారు పద్మనాభం, గోవిందప్ప, బాలాజీ, మోహన్, రవీంద్ర పాల్గొన్నారు.



- పుత్తూరు టౌన్‌లో.. అంబేద్కర్ భవన్‌లో ఎఐటియుసి పుత్తూరు ప్రాంత కార్యకర్తల సమావేశం హేమావతి అధ్యక్షతన జరిగింది.. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమ్మెలో పాల్గొని కార్మిక సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మహేష్, గోపి పాల్గొన్నారు.
- బిఎన్ కండ్రిగలో కుక్కంబాకం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సమావేశం జరిగింది. కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి, రోజుకు 600 రూపాయల వేతనం కల్పించాలని, బడ్జెట్లో ఉపాధి హామీ నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేకే రమణయ్య, కృష్ణమ్మ, సుజాత, మల్లేశ్వరి పాల్గొన్నారు.
- వెంకటగిరి టౌన్‌లో.. ఐదో వార్డు ఏరియాలో సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, పెంచలయ్య, సుబ్రమణ్యం, ఇందిరమ్మ, శేషయ్య పాల్గొన్నారు.



టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన జర్నలిస్టుల పిల్లలు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ : ఎంఎల్‌సి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని ఎమ్మెల్సీ, రష్ ఆసుపత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన జర్నలిస్టు పిల్లలకు ప్రతిభ పురస్కారాలను ఆదివారం అందజేశారు. మొత్తం 27 మంది విద్యార్థులకు నగదుతో కూడిన ఈ అవార్డులను ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య పట్ల ప్రతి ఒక్కరు ఇష్టాన్ని పెంచుకోవాలన్నారు. చిన్నతనం నుంచి లక్ష్యం పెట్టుకుని చదవాలని చెప్పారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా కష్టపడి ఉన్నత చదువులు వైపు అడుగులు వేయాలన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మురళి, బాలచంద్ర మాట్లాడుతూ జర్నలిస్టు పిల్లలను ప్రోత్సహించాలని, విద్యతో కలిగే ప్రయోజనాలను తెలియ చెప్పాలన్న సంకల్పంతోనే ఈ అవార్డుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు లావణ్య కుమార్, జాయింట్ సెక్రటరీ జగదీష్, విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులివ్వండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి నియోజకవర్గం లో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరయ్యేలా చొరవ చూపాలని జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు. మంత్రి ఆదివారం తిరుపతికి విచ్చేసిన సందర్భంగా సుధీర్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన అభివద్ధి, పెండింగ్ పనులను మంత్రి ముందు ఉంచారు. సుపరిపాలనకు-తొలి అడుగు కార్యక్రమం జరుగుతున్న తీరును మంత్రికి వివరించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఎఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూలై 7వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చుని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య ఐఎఎస్ తెలియజేశారు.

సమాజాభివృద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ కృషి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సమాజాభివద్ధికి బాబూ జగ్జీవన్ రామ్ విశేష కృషి చేశారని ఎపిఎస్ పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు పేర్కొన్నారు. డిస్కమ్ కార్పొరేట్ కార్యాలయం (విద్యుత్ నిలయం)లో ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి సంతోష రావు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ సుదీర్ఘకాలంపాటు దేశ వ్యవహారాల్లో ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆయన కేంద్ర వ్యవసాయశాఖా మంత్రిగా కొనసాగిన సమయంలో దేశంలో ఆహార సమస్య పరిష్కారానికి అవిరళ కృషి చేశారన్నారు. అలాగే రక్షణ శాఖా మంత్రిగా వున్నపుడు బంగ్లాదేశ్ సమస్యను చాకచక్యంగా పరిష్కరించారని తెలిపారు. సంస్థ ఉద్యోగులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని సంస్థ అభివద్ధికి తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కే. గురవయ్య, పి. అయూబ్ ఖాన్, జనరల్ మేనేజర్ వై. వెంకటరాజు పాల్గొన్నారు.

- తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్ కుమార్ రెడ్డి, కేశవాయనగుంట జగజీవన్ రామ్ పార్కు నందు ప్రతిష్టించిన విగ్రహానికి ఆదివారం పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఉప సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్యాం సుందర్ రావు, సత్యవేడు ఉప సంక్షేమ శాఖ అధికారి శేఖర్ బాబు, వార్డెన్స్ చందన, ప్రసూన, మంజుల, శశికళ , ,బాబు రెడ్డి నివాళి అర్పించారు.





ఇంపాక్టు సభ్యులు ప్రణాళికతో పనిచేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఇంపాక్టులో ఉండే సభ్యులు ప్రణాళికతో పనిచేయాలని అడ్వైజరీ బోర్డు మెంబర్ డాక్టర్ శ్రీధర్ విఠలం తెలిపారు. ఆదివారం ఇంపాక్టు సభ్యులు, ట్రైనర్లతో గెట్‌టుగెదర్ కార్యక్రమం శిల్పారామంలో జరిగింది. రీజనల్ ప్రెసిడెంట్ తహస్సుని సా బేగం, డాక్టర్ శ్రీధర్ విఠలం హాజరై ఈ కార్యక్రమంలో టీం వర్క్ గురించి సభ్యులకు ట్రైనింగ్ ఇచ్చారు. లీడర్షిప్ క్వాలిటీ లక్షణాలను వివరించారు.అనంతరం సభ్యులందరూ సరదాగా ఆటపాట కార్యక్రమాలతో భోజనాలతో వాళ్ల యొక్క సమావేశాన్ని సంబరాలుగా జరుపుకున్నారు. గంప నాగేశ్వరరావు ఆశయాలకు అనుకూలంగా ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమానికి ప్రాజెక్టు కోఆర్డినేటర్ మాధవి, పీ ఎన్ కుమార్, . నారీ సెల్ ఆర్గనైజర్ ఝాన్సీ, సాగరిక సర్వీస్ డైరెక్టర్ లత, జయశంకర్,. బిజినెస్ రీజనల్ డైరెక్టర్ మునీంద్ర, ట్రైనింగ్ డైరెక్టర్ ముఖేష్, విజయ్ పాల్గొన్నారు.

హర్షా టయోటా నూతన షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

తిరుపతిలోని కరకంబాడి రోడ్‌లో హర్షా టయోటా కొత్త షోరూమ్‌ను ప్రారంభించారు. ఇప్పటికే హర్షా టయోటా అనేక మంది కస్టమర్లకు సేవలందిస్తూ విశ్వాసాన్ని పొందింది. ఈ కొత్త బ్రాంచ్ ద్వారా వారు తమ సేవలను మరింత విస్తరించి, తిరుపతిలో కస్టమర్లకు ఇంకా చేరువవుతారని నమ్మకం ఉంది.ఈ కార్యక్రమంలో ఆర్‌టిఒ మురళీమోహన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు శ్రీరామ్ కిషోర్ పాల్గొన్నారు. .



అక్రమ తోడేళ్లకు అడ్డేది..?

సహజ వనరులు ఆవిరి
ప్రభుత్వ ఆదాయానికి గండి
అధికారుల నిఘా ఎక్కడ?

ప్రజాశక్తి -ఏర్పేడు

కాలువల్లో చెరువుల్లో ఇసుక, మట్టిని అక్రమంగా తరలించడంతో రాను రాను సహజ వనరులు ఆవిరైపోయి పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. ప్రకతి వనరులు మానవ అవసరాలను తీర్చడానికే గాని అత్యాశ తీర్చడానికి కాదు. అయితే కొందరు అధికార అండ చూసుకుని చెరువులు, కాలవలను గుల్ల చేస్తున్నారు. మైనింగ్ మాఫియాతో కొందరు ఎంతటి దారుణానికైనా పాల్పడుతున్నారు. మరి కొందరు అనుమతులు గోరంత తీసుకుని కొండంత తవ్వేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏర్పేడు మండలంలో మట్టి ఇసుక తవ్వకాలే ఇందుకు నిదర్శనం.



మేర్లపాక తామర గుంట చెరువులో ఎక్స్కవేటర్ల సహాయంతో ....

మండలంలో ఐఐటి, ఐజర్ విశ్వవిద్యాలయాలు, స్కూల, సూక్ష్మ పరిశ్రమలు, జాతీయ రహదారులు, విమానాశ్రయం, టోల్ ప్లాజాలు వంటివి ఏర్పడడంతో భూములకు రెక్కలొచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకొంది. దీంతో ప్రైవేట్ సంస్థలు చొరబడి కమర్షియల్ ప్లాట్ల నిర్మాణాలు ఎక్కువగా చేపట్టడంతో అక్రమ మాఫియా మట్టి, ఇసుకను అడ్డగోలుగా తోడేస్తున్నారు. చెరువులు, చిన్న పెద్ద కాలువలని తేడా లేకుండా స్వర్ణముఖి నది నుండి ఇసుకను, ఆయా ప్రాంతాల చెరువులలోని మట్టిని, గుళ్ళు ఇసుకను అక్రమంగా వెంచర్లకు, ప్లాట్లకు రవాణా చేసి అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. అక్రమ మాఫియా సహజ వనరులను ట్రాక్టర్లు తో గ్రామాల మీదుగా అతివేగంతో తరలించడంతో నివాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఆయా గ్రామాలలోని అక్రమ మాఫియా సహజ వనరులను దోచుకో పోతుంటే అధికారులు ఏం చేస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సచివాలయం వ్యవస్థ ప్రతి పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్నది. ఈ వ్యవస్థ సహాయంతో అక్రమ సహజ వనరుల దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మేర్లపాక రిజర్వాయర్ కలుజులో మట్టిని అక్రమంగా తవ్వేయడంతో హై టెన్షన్ పోల్ కు పెను ప్రమాదం ఏర్పడనున్న దృశ్యం

బీసీలంటే సామాజిక శక్తి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

బీసీలలోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయిస్తూ అన్ని కులాల అభివృద్ధికి కృషి చేస్తున్నది ఒక్కతెలుగుదేశం పార్టీయేనని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి ఇందిరా మైదానంలో బీసీ ఆత్మగౌరవ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ వెల్ఫేర్ మంత్రి సవిత, ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ ఇతర ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ శాసనసభ్యులు, బిసి సంక్షేమ సంఘం ముఖ్య నాయకులు తో కలిసి తుడా చైర్మేన్ డాలర్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీ కార్పొరేషన్ కు, అదే విధంగా బీసీ ఉప కులాల కార్పొరేషన్‌కు అధిక శాతం నిధులను కేటాయించి బీసీలను ఆర్థికంగా సామాజికంగా పైకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని కొనియాడారు. బీసీలంటే వెనకబడిన వారు కాదని, బీసీలు అంటే సమాజాన్ని ముందుకు నడిపే వారని పేర్కొన్నారు.

అపరంజికి ఘన సన్మానం


రిటైర్డు అధ్యాపకుడిని సన్మానిస్తున్న మాజీ మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : విద్యారంగం సేవలకు గుర్తింపు విశ్రాంత అధ్యాపకులు అపరంజి అని మాజీ మంత్రి ఆర్ కె రోజా తెలిపారు. స్థానిక ఎన్‌జివో కాలనీకి చెందిన, ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు అపరంజిని మాజీ మంత్రి రోజా ఆదివారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యారంగంలో అపారమైన సేవలందించిన అపరంజి నిజాయతీ, నిబద్ధతకు నిదర్శనమని ఆమె ప్రశంసించారు. ఉపాధ్యాయులుగా అందించిన సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ఇలాంటి ఆదర్శ ఉపాధ్యాయులను గుర్తించి సన్మానించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు డి శంకర్, డి జయప్రకాష్, కౌన్సిలర్ బాలసుబ్రహ్మణ్యం, మైనార్టీ సెల్ నాయకులు మహిన్, వైసిపి రాష్ట్ర నాయకులు భూ శేఖర్, మాజీ ఆలయఛైర్మన్ మనోహర్ రెడ్డి ప్రసాద్ రెడ్డి, ఎస్‌టి సెల్ రాష్ట్ర నాయకులు చిరంజీవి, సిఎస్ దిలీప్ కుమార్, బాబు, మూర్తి, స్థానిక వైసిపి నాయకులు, మున్సిపల్ ప్రతినిధులు, విద్యావేత్తలు, స్థానిక అభిమానులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ద్రౌపది, ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా వచ్చిన సుమారు 2 వేల మంది భక్తులకు శ్రీకాళహస్తి లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశామని అసోసియేషన్ అధ్యక్షుడు జయశంకర్ తెలిపారు. ప్రతి ఏటా అగ్నిగుండ మహోత్సవానికి అన్నదానం చేస్తున్నామని, ఈ ఏడాది కూడా చేయడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ నాయకులు సాయి రెడ్డి, గోపి, యుగంధర్ డ్రైవర్లు పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపి, టౌన్ క్లబ్ సేవా కార్యక్రమాలలో భాగంగా ఆదివారం పౌష్టిక ఆహారం, దుస్తులు అందించారు. ఆర్య వర్షన్ పుట్టిన రోజు సందర్భంగా గోరంట్ల రాంబాబు, సుజాత లు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆరవ్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైజేపి క్లబ్ సెక్రటరీ మురళీ కృష్ణ, ట్రెజరర్ గోపినాథ్ రెడ్డి, క్లబ్ సభ్యులు శ్రీనివాస్ యాదవ్, ట్రెజరర్ ప్రసాద్, మురళి నాయుడు, మనోజ్ కుమార్, స్వామి మురళి రాజు, రాజేంద్ర, ప్రభాకర్, హరి కృష్ణ పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు ఉచిత టీకాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. ప్రపంచ జోనోసిస్ డే సందర్భంగా పాడి రైతులకు పెంపుడు కుక్కల యజమానులకు జోనోటిక్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం 45 కుక్కలకు, 3 పిల్లులకు రేబిస్ వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా గూడూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు సురేష్ మాట్లాడుతూ మూగ జీవుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ కలిగి ఉండాలని పేర్కొన్నారు. పెంపుడు జంతువులు పెంచుకుంటున్న యజమానులు జంతువులు పట్ల పరిశుభ్రత పాటించాలని ఎప్పటికప్పుడు జంతువులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని తెలిపారు. వైద్యుల సూచనల మేరకు టీకాలు వేయించాలన్నారు.

సత్యవేడు: యాంటీ రేబిస్ టీకాలు వేయడానికి 500 డోసులు అందు బాటులో ఉన్నాయని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ దయాకర్(ఇరుగుళం) అన్నారు. అంతకు ముందు 13 పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది సుందరం, విల్ బి రాజు పాల్గొన్నారు.

క్యాంపస్ : రేబీస్ వ్యాధి నివారణలో ముందస్తు వ్యాక్సినేషన్ ఎంతో ఉత్తమమని వెటర్నరీ కాలేజీ డీన్ జగదీశ రామయ్య పేర్కొన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం వెటర్నరీ సైన్స్ కళాశాల, తిరుపతి, వెటర్నరీ పబ్లిక్ హెల్త్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా, కాలేజీలో హై రిస్క్ ఎక్స్‌పోజ్ గ్రూప్ కోసం, ప్రొఫైలాక్టిక్ యాంటీ-రాబీస్ వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించారు. వెటర్నరీ సైన్స్ ఫ్యాకల్టీ, సిబ్బంది, క్లినికల్ రొటేషనుకు హాజరయ్యే విద్యార్థులు, రయా హాస్టల్, తిరుపతి ఎస్‌పిసిఏయిలలో ఉన్న ఇతరులు పాల్గొని తొలి డోస్ టీకా వేశారు. మొత్తం 130 మంది (విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది) వ్యాధిని నివారించే చర్యగా తొలి డోసును పొందారు. ఈ సందర్భంగా కాలేజ్ అసోసియేట్ డీన్ డాక్టర్ జగదీశ రామయ్య మాట్లాడుతూ రేబీస్ టీకాలు వేసుకోవాలన్నారు. వెటర్నరీ పబ్లిక్ హెల్త్ విభాగాధిపతి డా. సి. ఎస్ శ్వేత ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న బియ్యపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్ పురంలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామిని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదివారం తన అనుచరులతో కలిసి దర్శించుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

అగ్నిగుండ మహోత్సవంలో ఎంజిఎం సేవలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి వారి అగ్నిగుండం మహోత్సవం లో ఆదివారం ఎంజిఎం ఆస్పత్రి సేవలు అందించింది. శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డి ఆధ్వర్యంలో మేరకు భక్తుల రద్దీ దృష్ట్యా అత్యవసర వైద్యం నిమిత్తం సిబ్బందిని, అంబులెన్స్ ను అందుబాటులో ఉంచినట్లు డైరెక్టర్ గుధుర్ మయూర్ తెలిపారు. ప్రజా సేవలో ఎంజిఎం సంస్థలు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటాయని స్పష్టం చేశారు.

అన్నప్రసాదంలో ఇక రాత్రి వేళల్లోనూ వడ

ప్రజాశక్తి -తిరుమల: భక్తులకు నాణ్యతతో కూడిన రుచికరమైన అన్నప్రసాదం అందించాలనే లక్ష్యంతో టిటిడి కీలక నిర్ణయం తీసుకుంది. అన్నప్రసాద కేంద్రాల్లో మధ్యాహ్న భోజన సమయంలో మాత్రమే కాకుండా, రాత్రి భోజనంలోనూ భక్తులకు వడలను వడ్డించేందుకు ఏర్పాట్లు చేపట్టింది. ఆదివారం సాయంత్రం తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఛైర్మన్ బీఆర్ నాయుడు వడల వడ్డింపు ప్రారంభించారు. స్వయంగా భక్తులకు వడ్డించారు. అనంతరం బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం రోజుకు సుమారు 70 వేల నుంచి 75 వేల వడలను ప్రత్యేకంగా తయారు చేసి భక్తులకు వడ్డిస్తున్నామని చెప్పారు. భోజన నాణ్యత మెరుగుపరచే దిశగా ఈ చర్యలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నప్రసాదంలో భక్తులకు వడలు అందించనున్నారు.

కదలని చెత్తాచెదారం

- కంపు భరించేదెట్టా?
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- స్థానికులను పీడిస్తున్న జ్వరాల భయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో ఎక్కడ పడిన చెత్త అక్కడే పడి పేరుకుపోతున్నాయని పలుసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేక పోతోంది. దీంతో స్థానిక ప్రజలు 'పేరుకుపోతున్న చెత్త కుప్పల కంపును ఎలా భరించాలి?' అని నిలదీస్తున్నారు. దోమలు అధికమై రోగాలు వ్యాపించకముందే మున్సిపల్ అధికారులు మేల్కోవాలని కోరుతున్నారు.


చెత్తకుండీ నిండి రోడ్డుపై పడుతున్న చెత్త కుప్పలు

కదలని చెత్తాచెదారం

ప్రధాన కూడలి జెండామాను వీధి బాలికల పాఠశాల ఎదురుగా వున్న రోడ్డుపై చెత్తాచెదారం నిండి పోయిం ది. షాపు వీధి ఎక్స్‌టెన్షన్‌లో పది రోజులుగా రెండు వార్డులకు సంబంధించిన చెత్త ఒకే చోట వేయడంతో చెత్తకుండీ నిండి రోడ్డుపై చెత్తాచెదార చెల్లాచెదురుగా పడుతోంది. దీంతో వాహనాలు, కాలినడకన వెళ్లేవారు దుర్వాసనకు ముక్కులు మూసుకొని వెళ్లే దుస్థితి నెలకొంది. మున్సిపాల్టీ పారిశుధ్య సిబ్బంది దీనిపై స్పందించాలని కోరుతున్నారు.

కంపు భరించేదెట్టా?

ప్రధాన రహదారుల్లో చెత్తకుప్పలు పేరుకుపోతుండడంతో చెత్తకుండీల పక్కన ఇళ్లలో నివసిస్తున్న వారు దోమలు బెడదతో, విష జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. భరించలేని దుర్వాసనను భరించలేమని పలుమార్లు మున్సిపల్ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ప్రజలు సమస్యలను పట్టించుకోవడం లేదు.

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కమిషనర్ పారిశుధ్యంపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వార్డు ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ శాఖ సిబ్బంది స్పందించి పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రోడ్డుపై చెత్తాచెదారాన్ని తొలగించి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సౌకర్యాల కల్పనపై శ్రద్ధ ఏదీ?

మున్సిపల్ శాఖ వారికి అభివృద్ధి కోసం పన్నులు వసూలుపై వున్న శ్రద్ధ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంపై లేదు.. వెంటనే స్పందించాలి..

- వేణుగోపాల్, 14 వ వార్డు, పుత్తూరు మున్సిపాల్టీ.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

వారం రోజులు క్రితం మున్సిపల్ శాఖ వారితో చెత్త కుండీ నిండి రోడ్డుపై పడుతోందని ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకో లేదు. ఏదో ఒక కుంటి సాకులు చెప్పుకుని కాలయాపన చేస్తున్నారు. మా సమస్యలను ఎప్పటికీ పరిష్కరిస్తారో తెలియడం లేదు.

-నాగరాజు, 14 వవార్డు, పుత్తూరు మున్సిపాల్టీ.

హానికర లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి: సిఐటియు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం బ్రిటిష్ కాలం నుండి కొనసాగుతున్న 44 చట్టాలలో ముఖ్యమైన 29 చట్టాలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను కార్మిక వర్గానికి హానికరంగా ఏర్పాటు చేసిందని, వీటిని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం కోరారు. గూడూరు సిఐటియు కార్యాలయంలో ప్రజా సంఘాల విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ కోడ్‌ల ద్వారా సంఘాలు ఏర్పాటు చేసుకోవడం కష్టతరం అవుతుందని, సంఘం బేరసారాల శక్తిని కోల్పోతాయని, యజమానికి విపరీతమైన అధికారాలు అప్పగిస్తోందన్నారు. సాధారణ కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ బోనస్, గ్రాడ్యుటి, పెన్షన్, అందని ద్రాక్షలా అవుతాయని, కనీస వేతనం అమలు కాదన్నారు. క్యాంటీన్ అలవెన్స్ లాంటి కనీస సౌకర్యాలకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. కాంట్రాక్టర్ల చెల్లింపు ఎగవేతలకు యాజమాన్యం (ప్రిన్సిపల్ ఎంప్లాయిస్) బాధ్యత వహించదని, పని గంటలు 12 గంటలకు పెంచుతారని మహిళలు రాత్రి పూట పని చేయాలన్నారు. కార్మికుల రక్షణకు సేఫ్టీ ఆఫీసరు కాని, వెల్ఫేర్ ఆఫీసర్ కాని, ఇకపై ఉండరని జీతాలు చెల్లింపు యజమాని దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రమాదకరమైన కోడ్‌లు రద్దు చేసేందుకు జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పామంజి మణి అధ్యక్షతన నిర్వహించిన సిఐటియు మండల విస్తృత సమావేశంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి బీవీ రమణయ్య, ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్రావతి, ప్రభావతి, ఆశ సంఘం నాయకురాలు ఉష, విఆర్‌ఏ అ సంఘం నాయకులు సుబ్బయ్య, రామయ్య, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, ఆటో సంఘం నాయకులు భాస్కర్ రెడ్డి, మహబూబ్ బాషా, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గండికోట మధు, బండి కృష్ణయ్య, జిలాని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నారాయణ, ముత్యాలయ్య, మున్సిపల్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం

అంతా సుపరిపాలనే: ఎమ్మెల్యే


ఇంటింటికీ ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వంలో వచ్చే నాలుగేళ్ల రాష్ట్ర ప్రజలకు సుపరిపాలనే అందనుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని జగ్గరాజు పల్లిలో ఆదివారం నిర్వహించిన సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అమలు చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర ఇచ్చారా?: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రైతులను రాజకీయం కోసం వాడుకోవడం వైసిపికే చెల్లిందని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదువందల కోట్లు ఖర్చు పెట్టి ప్యాలెస్ కట్టుకున్న జగన్ ఐదేళ్ళ కాలంలో ఐదు రూపాయలు అయినా మామిడి రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చాడా? అని ప్రశ్నించారు. జగన్, పెద్దిరెడ్డి సహా వైసిపి ఫ్యాక్టరీల ద్వారా ఇరవై రూపాయలకు కొనవచ్చు కదా? ఎందుకు కొనడం లేదని నిలదీశారు. కొందరు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని రైతులు వారి మాయలో పడొద్దన్నారు. అసలు జగన్ పూతలపట్టుకు ఎందుకు వస్తున్నారు? రైతులను ఏం చేద్దామని వస్తున్నాడో చెప్పాలన్నారు. జగన్ కు దమ్ముంటే మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం నడిపే గుజ్జు పరిశ్రమ వద్దకు వెళ్లి జగన్ నిరసన వ్యక్తం చేయగలడా? సిండికేట్‌గా మారి రైతులను ముంచేసింది వైసిపి నేతలే అని ఎమ్మెల్యే విమర్శించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. డాక్టర్లు ఈ వైద్య శిబిరంలో పాల్గొని వాకర్స్ అందరికీ ఆరోగ్యం కోసం తగిన జాగ్రత్తలు తెలిపినందుకు డాక్టర్లను అభినందిస్తున్నానని తెలిపారు. అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేస్తూ మందులు ఇవ్వడం అభినందనీయమని తెలిపారు . ఈ కార్యక్రమంలో నారా గోపాల్, డాక్టర్ కీర్తి, డాక్టర్ త్రివిక్రమ్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ నాగరాజు, వేగూరు రాజేంద్రప్రసాద్, వసంత్, శర్మ, విజయ్, కాలేషా, సురేష్ పాల్గొన్నారు.

ఆర్కే అబాకస్ విద్యా సంస్థ ఘనత

పజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని స్థానిక యూత్ హాస్టల్ ప్రాంగణంలో 'రాపిడ్ అబాకస్, వేదిక్ మ్యాథమెటిక్స్' ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 250 మంది చిన్నారులు పాల్గొని, అబాకస్, వేదిక్ గణితంపై మౌలిక పరీక్షలను ఏకధాటిగా 30 నిమిషాల పాటు సామూహికంగా విజయవంతంగా నిర్వహించారు. ఈ విశిష్ట కార్యక్రమాన్ని లండన్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు బింగి నరేంద్ర గౌడ్, అరుణ్ కుమార్, రవికుమార్ పరిశీలించారు. వారు చిన్నారుల ప్రతిభను స్వయంగా పరీక్షించి, ఆడిషన్, సబ్ట్రాక్షన్, డివిజన్, స్క్వేర్స్, క్యూబ్స్ వంటి అంశాల్లో ఉన్నత నైపుణ్యాలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో అపుస్మ రాష్ట్ర నాయకులు డీజీ రఘు, తిరుపతి జిల్లా నాయకులు ఓ.వీ.ఆర్, రవీందర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, ఓం ప్రకాష్ రెడ్డి, కరస్పాండెంట్ స్ఫూర్తి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. పొకోనాటి హరికృష్ణ పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని మిట్టపల్లూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మంగమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసుకుంటూ ఉండేది. శనివారం ఉదయం ఆమె మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరి మ్మెల్యే గాలి భాను ప్రకాష్ మిట్టపల్లూరు గ్రామానికి వెళ్లి మృత దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామని, ఆయన వెంట రాష్ట్ర బీసీ పన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగం రెడ్డి, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

తిరుమలలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి -తిరుమల: ఎస్పి వి హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో తిరుమలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ఆదివారం నిర్వహించారు. తిరుమల పోలీస్, టిటిడి విజిలెన్స్, టిటిడి అండ్ గవర్నమెంట్ ఫారెస్ట్ స్టాఫ్, బాంబ్ డిస్పోసల్ టీం, ఫైర్ డిపార్టుమెంట్, రెవెన్యూ డిపార్టుమెంట్ వారితో సంయుక్తంగా కలిసి కార్డన్ సెర్చ్ చేశారు. కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా 148 దుకాణాలు తనిఖీ చేయగా 40 మంది అనధికారికంగా లైసెన్స్ లేకుండా అంగళ్లు పెట్టుకుని ఉన్నారని తేల్చారు. లైసెన్స్ లేని షాపుల గురించి టీటీడీ, ఫారెస్ట్ అధికారులకు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించడమే లక్ష్యంగా కార్డన్ అండ్ సెర్చ్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల అడిషనల్ ఎస్పీ ఐ రామకృష్ణ, రాముడు సిఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంచార జాతులు మరింత బలపడాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : సంచార జాతులు మరింత బలోపేతం చెందాలని, వృత్తి రంగాల్లో మరింత రాణించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ మాజీ సిడబ్ల్యూసి మెంబర్, కమ్యూనిటీ లీడర్ ఎన్.దొరస్వామి అన్నారు. ఆదివారం ఎంఆర్‌పల్లిలోని యూత్‌హాస్టల్లో కేంద్ర ప్రభుత్వ సాంఘిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ డిఎన్‌టి బోర్డు, ఎస్ఎస్ఎఫ్‌డిసి, ఎస్ఐఎంఎస్ ఎంఇ సౌజన్యంతో పరివర్తన సేవాసంస్థ ఆధ్వర్యం లో సంచార జాతుల తెగల సంఘాల బలోపేతం, ఉపాధి శిక్షణ, పథకాలపై అవగాహన కల్పించారు.

షాపులపై విచారణ చేపట్టండి..

మంత్రి లోకేష్‌కు ఆర్ఆర్ యాదవ్ వినతి

ప్రజాశక్తి -రేణిగుంట: అలిపిరి నుండి తిరుమల వరకు మెట్లు మార్గం ద్వారా 150 షాపులు అక్రమంగా వెలిశాయని వీటిపై విచారణ చేపట్టాలని మంత్రి లోకేష్‌కు ఆర్ఆర్ యాదవ్ వినతిపత్రం అందించారు. మంత్రి నారా లోకేష్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. విజయవాడ నుండి విమానాశ్రయం చేరుకున్న లోకేష్ కు విమానాశ్రయంలో జిల్లా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తిరుపతి టిడిపి యువ నాయకుడు ఆర్ఆర్ యాదవ్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో అలిపిరి నుండి తిరుమల వరకు మెట్లు మార్గం ద్వారా 150 షాపులు అక్రమంగా వెలిశాయని అందుకు ఫారెస్ట్ అధికారులు మద్దతు పలుకుతున్నారని ఆ షాపులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతిపత్రం సమర్పించామని తెలిపారు.

ఎస్‌వియు జాబ్ మేళాలో 24 మంది ఎంపిక



జాబ్ మేళాను ప్రారంభిస్తున్న ఎస్‌వియు విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని స్టూడెంట్స్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ జూలై నెల 6 వ తేదీ ఎంఆర్ఎఫ్ సంస్థ ఆదివారం ఉద్యోగ మేళా నిర్వహించింది. ఎస్వీయూ ఇన్‌చార్జ్ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, డైరెక్టర్ ఆచార్య మురళీధర్, డాక్టర్ పత్తిపాటి వివేక్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్వీయూలో నిర్వహించిన జాబ్ మేళాకు 53 మంది నిరుద్యోగ అబ్బాయిలు హాజరయ్యారు. కాగా 24 మందిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు. వీరికి త్వరలో నియామక పత్రాలు అందజేస్తారని విశ్వవిద్యాలయ అధికారులు అన్నారు.

ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట మండలంలోని వెదుళ్ల చెరువు ఎస్‌టి కాలనీలో ఆదివారం సాయంత్రం పద్మ మహిళ మండలి ఆధ్వర్యంలో పేద విద్యార్థిని విద్యార్థులకు ఆదివారం ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభించారు. ముందుగా విద్యార్థిని విద్యార్థులకు విద్యాసామగ్రి నోట్ పుస్తకం ,పెన్ను, పెన్సిల్, రబ్బరు, ప్యాడు అందించారు. ఈ సందర్భంగా పద్మ మహిళా మండలి ప్రాజెక్టు ఆఫీసర్ జూలియన్ రాజు మాట్లాడుతూ ప్రైవేటుగా ట్యూషన్ కు వెళ్లలేని పేద విద్యార్థులకు పద్మ మహిళా పేద విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించడంలో భాగంగా ఈ ట్యూషన్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. విద్యార్థులు విద్యాభ్యాసంతో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇలాంటి ట్యూషన్లు ఉపయోగపడ తాయన్నారు. ట్యూషన్ అధ్యాపకరాలు విద్యార్థులకు మంచిగా బోధించి విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపాలని కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పద్మ మహిళ మండలి సూపర్‌వైజర్ శ్రీనివాసులు, టీచర్ అపర్ణ, అంగన్‌వాడీ టీచర్ గంగాదేవి, మాజీ వార్డు మెంబర్ సుబ్రహ్మణ్యం, ప్రసాద్ పాల్గొన్నారు.

వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర సెక్రటరీగా మురళీధర్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా చేరిన మురళీధర్ ఎన్ఎస్‌యుఐ ఆ తర్వాత ఏర్పడిన వైసిపి విద్యార్థి విభాగంలో కీలక సభ్యుడిగా అంచెలంచెలుగా ఎదుగుతూ వర్సిటీ అధ్యక్షుడిగా, ఇన్‌ఛార్జిగా ఉన్న పోతు మురళీధర్ కు పార్టీ కోసం ఆయన తపించే విధానం, వివిధ సమస్యలపై పోరాడే పట్టుదల, కృషి, పార్టీ ప్రతిష్టతకు ఆయన చేసిన కృషికి ఆయన సేవలు గుర్తించి రాష్ట్ర విద్యార్థి విభాగం సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా పోతు మురళీధర్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధినాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తనపై ఎంతో నమ్మకం ఉంచి విద్యార్థి విభాగం సెక్రటరీగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అందుకు కారణమైన రాయలసీమ విద్యార్థి విభాగం ఇన్‌ఛార్జి వి. హరిప్రసాద్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఎంతో నమ్మకం ఉంచి రాష్ట్ర సెక్రటరీగా నియమించినందుకు తన వంతు సాయశక్తుల విద్యార్థి విభాగం పటిష్టతకు, పార్టీ బలోపేతకానికి తన సాయశక్తులకు కృషి చేస్తానని అన్నారు.

బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి టిడిపి కార్యాలయంలో దళిత సంఘాల నాయకులు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఘన నివాళులర్పించారు. టిడిపి పనపాకం మాజీ ఎంపిటిసి బల్లిపాకుల గురవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టిడిపి ఎస్‌సి సెల్ మండల మాజీ అధ్యక్షులు విసురుపాటి శంకర్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేసిన సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధులు బాబు జగజ్జీవన్ రాం అన్నారు. మిట్టపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జగ్జీవన్ రాంను స్ఫూర్తిగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడిచి ప్రజలకు సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కోశాధికారి మఠంపల్లి హరి, మండే రావు, వెంకటరామయ్య, బి. కిషోర్, వామనమూర్తి, వెంకటరమణ, పి సుబ్రహ్మణ్యం, ఎల్లప్ప, రామ్మూర్తి పాల్గొన్నారు.

9 నుంచి తిరుపతి -కాచిగూడ మధ్య 48 ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రోజురోజుకూ పెరుగుతున్న రైల్వే ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు, వారికి ఇబ్బందులను తగ్గించి, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికులు రద్దీ ఎక్కువగా ఉండే మార్గాల్లో 48 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు సిద్ధమైంది. ఈ మేరకు తిరుపతి–హిసార్ మధ్య 12 సర్వీసులను నడపనున్నట్టు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఈ మార్గంలో నడిచే రైళ్లు ప్రతి బుధ, ఆదివారాల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని రైల్వేశాఖ పేర్కొంది. అదే విధంగా కాచిగూడ–తిరుపతి మధ్య కూడా ప్రత్యేక రైళ్లను నడపనుంది. ఈ మార్గాల్లో ప్రతి గురు, శుక్రవారాల్లో 8 ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగించినున్నారు. ఇక రైల్వేశాఖ నడపనున్న ప్రత్యేక రైళ్లలో అత్యధికంగా నరసాపూర్–తిరువణ్ణామలై మార్గంలో 16 ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగించనున్నారు. ఈ మార్గాల్లో బుధ, గురువారాల్లో ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసులన్ని జులై 9 నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని దక్షిణ మధ్య రైల్వేశాఖ స్పష్టం చేసింది.

బీసీల ఐక్యతతోనే పరిపాలన సాధ్యం

ఆత్మగౌరవ సభలో మంత్రులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: బీసీలు అంటే వెనుకబడిన తరగతులకు చెందిన వారు కారని, ముందుండి నడిపే జనసంద్రమని వారంతా ఐక్యంగా ఉంటే బీసీల పరిపాలన సుసాధ్యమవుతుందని రెవెన్యూ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, బీసీ మంత్రిత్వ శాఖ మంత్రులు అనగాని సత్యప్రసాద్, వై సత్య కుమార్, సవిత అన్నారు. ఆదివారం తిరుపతి నగరంలోని ఇందిరా మైదానంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం, అంబేద్కర్ పూలే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బీసీ ఆత్మగౌరవ భరోసా సభ నిర్వహించారు. ఈ ఆత్మగౌరవ భరోసా సభకు వందలాది మంది బీసీ సంఘాలకు చెందిన వారు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకర్రావు, అంబేద్కర్ పూలే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పరసారత్నం పాల్గొన్నారు.

క్రైం న్యూస్

యువకుడు ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన గణేష్ (30) పోలీస్ స్టేషన్ ఆవరణలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిం చాడు. దీన్ని గమనించిన పోలీసులు అడ్డుకొని అతడిని కాపాడారు. రేణిగుంట పోలీసుల కథనం మేరకు..గణేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ తన గ్రామంలో చిన్నస్థాయి చిట్ ఫండ్ కార్యకలాపాలు నిర్వహిస్తుంటాడు. తన వద్ద డబ్బు కట్టిన ఎస్‌యు పురం గ్రామానికి చెందిన ఆర్ షణ్ముగం తను డబ్బులు అడిగితే ఇవ్వలేదని కాలయాపన చేస్తున్నానని ఈ నె 5వ తేదీ రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గణేష్‌ను స్టేషన్ వద్దకు రప్పించి విచారణ చేపట్టాలని ఎస్‌హెచ్‌వో ఫోన్ ద్వారా సమాచారం పంపారు. దీంతో గణేష్ తన భార్య లక్ష్మి, మామ వెంకటమునితో కలిసి వచ్చారు. మానసిక ఒత్తిడికి గురైన గణేష్ తన వెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోలు తనపై పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన పోలీసులు అప్రమత్తమై గణేష్‌ను రక్షించారు. అనంతరం గణేష్‌ను పోలీసులు ప్రశ్నించగా తాను కొన్ని బాధల్లో వున్నానని తెలిపాడు. చట్టపరంగా సమస్యను పరిష్కరిస్తామని సర్దిచెప్పి అతని మామకు అప్పగించి అక్కడి నుంచి పోలీసులు ఇంటికి పంపారు.

భాకరాపేట ఘాట్ లోయలో మృతదేహం

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని భాకరాపేట ఘాట్ రోడ్ లోని లోతట్టు ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం గుర్తించారు. భాకరాపేట నుండి తిరుపతికి వస్తున్న వాహనచోదకులు దుర్వాసనను గుర్తించి చంద్రగిరి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని పరిశీలించారు. మృతుని వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎవరైనా ఎక్కడో హత్య చేసి భాకరాపేట లోయలో పడేశారా? లేదా ఇక్కడికి తీసుకుని వచ్చి హత్య చేశారా..? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తిది హత్యా? లేక ఆత్మహత్యా? అనే విషయాలు పోలీసు విచారణలో తేలాల్సి వుంది. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుని గుర్తుపట్టిన వ్యక్తులు చంద్రగిరి పోలీసులను సంప్రదించాలని సీఐ టి సుబ్బరామిరెడ్డి తెలిపారు.

పట్టణంలో భారీ చోరీ

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలో శనివారం రాత్రి భారీ చోరీ చోటు చేసుకుందని సుమారు 55 సవర్ల బంగారు, మూడు లక్షల నగదు మరికొన్ని వెండి సామాన్లు పోయినట్లుగా తమకు ఫిర్యాదు అందిందని పోలీసులు ఆదివారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మూగాంబిక గుడి వీధిలో వుంటున్న హరేంద్రనాయుడు శనివారం రాత్రి తమ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని జగన్నాథ రథయాత్రకు హరేంద్ర నాయుడు దంపతులు , వారి ఇంటి చుట్టుపక్కల కొంతమంది శనివారం ఉదయం గూడూరుకి వెళ్లారు. రాత్రి 9 గంటల పైన ఇంటికి చేరుకున్నామని తెలిపారు. ఇంటికి చేరుకోగా ఇంటి తాళాలు తీసి ఉండడం గమనించి లోపలికి వెళ్లి పరిశీలించగా ఇంట్లో బంగారం, డబ్బు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పక్కింటి సునీతకు సంబంధించి 25 సవర్ల బంగారు నగలు, రెండున్నర లక్షల రూపాయలు నగదు కూడా అతని ఇంట్లోనే దాచి వుంచినట్లు సమాచారం. ఫిర్యాదుఅందుకున్న నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో యువకుడు వీరంగం

ఇద్దరిపై దాడి, బొటన వేలుపై గాయం

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మద్యం తాగిన మత్తులో మందు బాబు శివ వీరంగం చేసి ఇద్దరిపై కత్తితో దాడి చేసి బొటన వేలును గాయపరిచిన సంఘటన ఆదివారం నరసింగాపురంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు నర్సింగాపురం రైల్వే గేట్ వద్ద ఓ ఆటో పైన సామాన్లు వేసుకుని ఓ వ్యక్తి వెళుతుండగా సామాన్లు జారీ కిందపడ్డాయి. ఆ గ్రామానికి చెందిన టి ప్రవీణ్ కుమార్ కింద పడిన సామాన్లను తీసి ఆటోపై పెడుతుండగా నర్సింగాపురం గ్రామం నుండి శివ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో ఆటో వద్దకు చేరుకొని ఆటో వ్యక్తికి సహాయం చేస్తున్న ప్రవీణ్ కుమార్ పై మద్యం మత్తులో దాడికి దిగి నానా తిట్లు తిట్టాడు. ఇంతలో గ్రామస్తులు అక్కడి వచ్చి సర్దుబాటు చేస్తుండగా వారి ఇద్దరి మధ్య భాగ్యరాజ్ అనే వ్యక్తి అతడికి సపోర్టుగా వచ్చినందుకు శివ కత్తితో భాగ్యరాజు ఎడమచేతి బొటన వేలుపై గాయం చేశాడు. దీంతో ప్రవీణ్ కుమార్ చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.